





# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు








సంపుటి : 11 సంచిక : 324 పేజీలు : 12 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : విశాఖపట్నం మంగళవారం 29 జూలై 2025 వెల : 5/-రూ॥

VOLUME :11 ISSUE :324 PAGES : 12 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : VISAKHAPATNAM TUE 29 JULY 2025 PRICE : 5/- RS

Simultaneously Published form Visakhapatnam, Kakinada, Circulated by Srikakulam,Vizianagaram, Eluru,Vijayawada,Guntur, Prakasam,Nelloru,Chittur,YSR Kadapa, Kurnool, Anantapur


# బెస్ట్ పాలసీలన్నీ సింగపూర్ నుంచే వస్తున్నాయి

- సింగపూర్ లో చంద్రబాబు పర్యటన
- రెండో రోజు ఏపీ-సింగపూర్ బిజినెస్ ఫోరం సదస్సుకు హాజరు
- సింగపూర్ తో తాము 30 ఏళ్లుగా పనిచేస్తున్నామని వెల్లడి




**పెన్ పవర్ డెస్క్:**ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నేడు సింగపూర్ పర్యటన రెండో రోజు ఏపీ-సింగపూర్ బిజినెస్ ఫోరం సదస్సుకు హాజరయ్యారు. ఈ సందర్భంగా చంద్రబాబు ప్రసంగిస్తూ... ప్రపంచంలో ఎలాంటి బెస్ట్ పాలసీలు వస్తున్నా, అవి సింగపూర్ నుంచే వస్తున్నాయని అన్నారు. సింగపూర్ ప్రభుత్వంతో తాము 30 ఏళ్లుగా పనిచేస్తున్నామని చెప్పారు. తాను 90వ దశకంలో మొదటిసారి ముఖ్యమంత్రి అయినప్పుడు, హైదరాబాదు ఉప్పల్ లో సింగపూర్ టౌన్ షిప్ ఏర్పాటు చేయాలని కోరానని వెల్లడించారు. ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ లోనూ సింగపూర్ తరహాలో వరల్డ్ క్లాస్ సిటీ నిర్మించాలని దృఢ సంకల్పంతో ఉన్నామని అన్నారు. రాజధాని మాస్టర్ ప్లాన్ ఉచితంగా ఇచ్చేందుకు సింగపూర్ ముందుకువచ్చిందని తెలిపారు. 2014లో ఏపీ మాస్టర్ ప్లాన్ కోసం సింగపూర్ వచ్చానని, గత ప్రభుత్వ హయాంలో జరిగిన తప్పులను చక్కదిద్దేందుకే ఇప్పుడు మళ్లీ వచ్చానని చంద్రబాబు స్పష్టం చేశారు. నవంబరు 14, 15 తేదీల్లో ఏపీలో సీఐఐతో కలిసి సదస్సు నిర్వహిస్తున్నామని, ఈ సదస్సుకు సింగపూర్ ప్రతినిధులను కూడా ఆహ్వానిస్తున్నామని చెప్పారు.

భారత్ కు స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత నాయకులు మిక్స్ డ్, సోషలిస్ట్ ఆర్థిక సిద్ధాంతాలను అనుసరించా రని వెల్లడించారు. దాంతో భారత్ చాలాకాలం పాటు వెనుకబాటుతనంతో బాధపడిందని, అలాకాకుండా 1947 నుంచే ఆర్థిక విధానాల్లో పోటీపడి ఉంటే భారత్ ఈపాటికి ఉన్నత స్థానంలో ఉండేదని అన్నారు. చివరికి 1991 వచ్చాక గానీ భారత్ ఆర్థిక సంస్కరణ పట్టలేదని తెలిపారు. భారత్ లో ఆర్థిక సంస్కరణలు వచ్చిన 13 ఏళ్లకు చైనా కూడా సంస్కరణలు తీసుకువచ్చిందని చంద్రబాబు గుర్తుచేశారు.




## వేగవంతమైన ట్రాన్స్ ఫర్మేషన్ కోసం సింగపూర్ తో కలసి పనిచేస్తాం

- సింగపూర్ లో సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ తదితరుల పర్యటన
- నైపుణ్యాభివృద్ధిపై రౌండ్ టేబుల్ సమావేశం
- కీలక ప్రసంగం చేసిన నారా లోకేశ్



**పెన్ పవర్ డెస్క్:**వేగంగా అభివృద్ధి చెందుతున్న నేటి సాంకేతిక యుగంలో సంప్రదాయ విద్యా విధానం సరిపోదని, నాలుగో పారిశ్రామిక విప్లవం కేవలం సాంకేతిక నైపుణ్యాలను మాత్రమే కాకుండా, సంక్లిష్ట సమస్యలను పరిష్కరించగల సామర్థ్యాలను కూడా కోరుకుంటుందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు. సింగపూర్ లో 'నైపుణ్యాల నుంచి సామర్థ్యాలకు శ్రామికశక్తి పరివర్తనను వేగవంతం చేయడం' అనే అంశంపై జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో మంత్రి లోకేశ్ మాట్లాడుతూ, డైనమిక్ వాతావరణంలో సవాళ్లను స్వీకరించే, నూతనన అంశాలను ఆవిష్కరించే, సమస్యలను పరిష్కరించే సామర్థ్యం యువతకు అవసరమని ఉద్ఘాటించారు.

వివరాలు 2లో..

## పీ4 పథకంపై స్పష్టత ఇచ్చిన వైస్ చైర్మన్ సి.కుటుంబరావు

- ఉగాది రోజున పీ4 పథకం ప్రారంభించిన సీఎం చంద్రబాబు
- ఈ పథకంపై అపోహలు, ఆరోపణలు
- వివరణ ఇచ్చిన పీ-4 ఫౌండేషన్ వైస్ చైర్మన్ సి.కుటుంబరావు




**పెన్ పవర్ డెస్క్:**ఆంధ్రప్రదేశ్ పునర్నిర్మాణానికి దిశానిర్దేశకుడిగా నిలిచిన ముఖ్యమంత్రి చంద్రబాబు ఉగాది పర్వదినాన పీ4 (పబ్లిక్ - ప్రైవేట్ - పీపుల్స్

వివరాలు 2లో..

## పోలవరం-బనకచర్ల ప్రాజెక్టుపై కేంద్ర ప్రభుత్వం కీలక ప్రకటన

- ప్రాజెక్టు పనులను ఇంకా చేపట్టలేదని ఏపీ ప్రభుత్వం తెలిపిందన్న కేంద్రం
- రాజ్యసభలో కాంగ్రెస్ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్ ప్రశ్న
- లిఖితపూర్వక సమాధానం ఇచ్చిన కేంద్ర జల్ శక్తి శాఖ



**పెన్ పవర్ డెస్క్:**పోలవరం - బనకచర్ల ప్రాజెక్టుపై కేంద్ర ప్రభు త్వం కీలక ప్రకటన చేసింది. ఈ ప్రాజెక్టు పనులను ఇంకా చేపట్టలేదని ఆంధ్రప్రదేశ్ ప్రభు త్వం తెలిపిందని కేంద్రం పార్లమెంటుకు

వివరాలు 2లో..

## వాడీవేడిగా ఆపరేషన్ సిందూర్ పై చర్చ... విపక్షాలపై భగ్గుమన్న రాజ్ నాథ్ సింగ్



- కొనసాగుతున్న పార్లమెంటు సమావేశాలు
- కేంద్రంపై విపక్షాల విమర్శలు
- తిప్పికొట్టిన రాజ్ నాథ్

**పెన్ పవర్ డెస్క్:**రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ 'ఆపరేషన్ సిందూర్' పై లోక్‌సభలో విపక్షాలు అడిగిన ప్రశ్నల తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆపరేషన్ సిందూర్ పై పార్లమెంటులో చర్చ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విపక్ష ఎంపీలు ఈ ఆపరేషన్‌లో భారత సైనికులకు జరిగిన నష్టం గురించి, ఎన్ని భారత విమానాలు కూల్చివేతకు గురయ్యాయి అనే దాని గురించి మాత్రమే ప్రశ్నించారని విమర్శించారు. ఇటువంటి ప్రశ్నలు దేశ ప్రజల మనోభావాలను ఏ మాత్రం ప్రతిబింబించవని సింగ్ అన్నారు.

వివరాలు 2లో..

## తెలంగాణ హైకోర్టుకు నలుగురు అదనపు జడ్జిల నియామకం

- దేశంలోని పలు హైకోర్టులకు 19 మంది జడ్జిలు, అదనపు జడ్జిల నియామకం
- జడ్జిలు, అదనపు జడ్జీల నియామకానికి రాష్ట్రపతి ఆమోదముద్ర
- వెల్లడించిన కేంద్ర మంత్రి అర్జున్ రామ్ మేఘవాల్

**పెన్ పవర్ డెస్క్:**తెలంగాణ హైకోర్టుకు నలుగురు అదనపు న్యాయమూర్తులు నియమితులయ్యారు. దేశంలోని పలు హైకోర్టులకు చెందిన 19 మంది

వివరాలు 2లో..




## మోదీ, ట్రంప్ మధ్య ఫోన్ సంభాషణ జరగలేదు!

### ఆపరేషన్ సిందూర్‌పై జైశంకర్ కీలక వ్యాఖ్యలు

- ఆపరేషన్ సిందూర్ ద్వారా పాకిస్థాన్‌కు గట్టి సమాధానం ఇచ్చామన్న జైశంకర్
- ఉగ్రవాదాన్ని సహించేది లేదని ప్రపంచమంతా నినదించిందన్న జైశంకర్
- కాల్పుల విరమణలో ట్రంప్ ప్రమేయాన్ని కొట్టి పారేసిన జైశంకర్



**పెన్ పవర్ డెస్క్:**ఏప్రిల్ 22 నుంచి జూన్ 17 వరకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌ల మధ్య ఎలాంటి ఫోన్ సంభాషణ జరగలేదని కేంద్ర మంత్రి జైశంకర్ పేర్కొన్నారు. 'ఆపరేషన్ సిందూర్' పై లోక్‌సభలో చర్చ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ ఆపరేషన్ ద్వారా పాకిస్థాన్‌కు గట్టి సమాధానం ఇచ్చామని అన్నారు. ఉగ్రవాదాన్ని సహించేది లేదని ప్రపంచమంతా ముక్తకంఠంతో నినదించిందని గుర్తు చేశారు.

భారత్-పాకిస్థాన్ మధ్య కాల్పుల విరమణను కుదర్చడంలో ట్రంప్ ప్రమేయాన్ని ఆయన కొట్టి పారేశారు. పాకిస్థాన్‌లోని బహావల్‌పూర్, మురిద్కేలోని ఉగ్ర స్థావరాలపై దాడులు చేస్తామని

వివరాలు 2లో..

## వీఐపీలు ఏడాదికోసారి మాత్రమే శ్రీవారిని దర్శించుకోవాలి



**పెన్ పవర్ డెస్క్:**సోమవారం ( జులై 28 ) కుటుంబ సమేతంగా తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు భారత మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ వీఐపీ దర్శనాలను ఉద్దేశించి కీలక వ్యాఖ్యలు చేశారు. సామాన్య భక్తుల సౌలభ్యం కోసం వీఐపీలు ఏడాదికి ఒకసారి మాత్రమే తిరుమల శ్రీవారిని దర్శించుకోవాలని అన్నారు వెంకయ్య నాయుడు. సోమవారం ఉదయం ఆయన కుటుంబ సభ్యులతో కలిసి శ్రీవారిని దర్శించుకున్నారు. దర్శనానంతరం ఆయనకు రంగ నాయకుల మండపంలో పండితులు వేదాశీర్వచనం అందించగా, టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి స్వామివారి

వివరాలు 2లో..

## ఇప్పటికీ జగన్ మారలేదు... కంపెనీలు రాకుండా అడ్డుకుంటున్నారు

- వైసీపీ నేతలు విష ప్రచారం చేస్తున్నారన్న పల్లా
- పిల్ల సైకోల తీరు శ్రుతి మించుతోందని ఆగ్రహం
- ప్రజలు చెప్పినా వీళ్ల బుద్ధి మారడంలేదని విమర్శలు

**పెన్ పవర్ డెస్క్:**మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధినేత జగన్ పై టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు ధ్వజమెత్తారు. తన ఐదేళ్ల పాలనలో ఏపీ భవిష్యత్తును నాశనం చేసిన జగన్... ఇప్పుడు రాష్ట్రానికి దిగ్గజ కంపెనీలు రాకుండా అడ్డుకుంటున్నాడని మండిపడ్డారు. టీసీఎస్, గూగుల్, కాగ్నిజెంట్ వంటి కంపెనీలు రాష్ట్రానికి వస్తుంటే, వాటిని అడ్డుకునేందుకు తప్పుడు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. పిల్ల సైకోల దుష్ప్రచారం శ్రుతి మించుతోందని అన్నారు. తమ కుంభకోణాల భాగోతాలను కప్పిపుచ్చుకోవడం వైసీపీ నేతలు కూటమి ప్రభుత్వంపై బురద చల్లే కార్యక్రమం చేపట్టారని పల్లా శ్రీనివాసరావు ఆగ్రహం

వివరాలు 2లో..



## భారత్-పాకిస్థాన్ సహా ఆరు యుద్ధాలు ఆపేశాను

- భారత్-పాక్ యుద్ధంలో జోక్యం చేసుకున్నానని మరోసారి ట్రంప్ వ్యాఖ్య
- నేను లేకుంటే ఆరు పెద్ద యుద్ధాలు జరిగేవన్న ట్రంప్
- యుద్ధం చేస్తే వాణిజ్య ఒప్పందాలు కుదుర్చుకోనని చెప్పానని వ్యాఖ్య



**పెన్ పవర్ డెస్క్:** 'ఆపరేషన్ సిందూర్' నిలిచిపోవడంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోమారు పాత పాట పాడారు! భారత్-పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలు తలెత్తినప్పుడు తాను సరైన సమయంలో జోక్యం చేసుకున్నానని వ్యాఖ్యానించారు. తాను జోక్యం చేసుకోకపోతే రెండు దేశాలు ఈపాటికి యుద్ధం చేస్తూ ఉండేవని ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు.బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్‌తో కలిసి ఆయన స్కాట్లాండ్‌లో మీడియాతో మాట్లాడుతూ, ఇటీవలి కాలంలో ప్రపంచవ్యాప్తంగా తాను ఆరు యుద్ధాలను నివారించానని చెప్పుకొచ్చారు. ప్రపంచవ్యాప్తంగా పలుచోట్ల కాల్పుల విరమణలు కొనసాగుతున్నాయని ట్రంప్ పేర్కొన్నారు."నేనే లేకుంటే ఆరు పెద్ద యుద్ధాలు జరుగుతుండేవి. ఇందులో భారత్-పాకిస్థాన్ అతి పెద్దది. ఎందుకంటే ఈ రెండు అణ్వస్త్ర దేశాలు. ఒకవేళ అణ్వస్త్రాలు ప్రయోగిస్తే

వివరాలు 2లో..

## ఎడిటర్ వ్యూ

### కారును సరైన దారిలో నడిపించేదెవరు..
# కేసీఆర్ పూనుకోరా?

బీఆర్ఎస్ ఉద్యమ పార్టీ. తెలంగాణ ఉద్యమం నుంచి ప్రజల ఆదరాభిమానాలు గెలుచుకుని రెండుసార్లు అధికారంలోకి రాగలిగింది. 2014లో రాష్ట్ర విభజన జరిగిన తర్వాత వరసగా రెండు దఫాలు అధికారంలోకి వచ్చిన పార్టీ గత ఎన్నికల్లో ఓటమి పాలు కాగానే పార్టీలోని అగ్రనేత ఇంట్లోనే ప్రత్యర్థులు బయలుదేరడం ఆ పార్టీ క్యాడర్ జీర్ణించుకోలేకపోతుంది. వైసీపీ అధినేత జగన్ పరిస్థితి వేరు. ఆయన తన తండ్రి మరణం తర్వాత సొంతంగా వైసీపీని పెట్టుకున్నారు. అప్పటి వరకూ కలిసిమెలసిన అన్నా చెల్లెళ్లు అధికారంలోకి వచ్చిన తర్వాత వేరుపడ్డారు. రాజకీయంగా విభేదాలు బయటపడ్డాయి. కానీ బీఆర్ఎస్ పరిస్థితి వేరు. నాటి టీఆర్ఎస్ వ్యవస్థాపకుడు కేసీఆర్ మాజీ ముఖ్యమంత్రి కాగానే ఇక్కడ అన్నా చెల్లెళ్లకు పడటం లేదు.

**ఇంటి సమస్యలను పరిష్కరించుకోవాలని...**

ఇది ఇప్పుడు అధికార పక్షానికి వరంగా మారింది. తెలంగాణలో ఏ సమస్యపైనా అధికార పార్టీకి వ్యతిరేకంగా బీఆర్ఎస్ ఉద్యమం చేయాలని భావించినా ముందు ఇంటి సమస్యలను పరిష్కరించుకోవాలని సూచిస్తూ కాంగ్రెస్ నేతలు కౌంటర్ ఇస్తున్నారు. ఇది గులాబీ పార్టీ నేతలకు మింగుడు పడటం లేదు. సొంత చెల్లెలు విమర్శలకు సమాధానం చెప్పలేని కేటీఆర్ ఫ్రస్టేషన్ లో తమపై లేని పోని నిందలు వేస్తున్నారంటూ కాంగ్రెస్ నేతలు ఒంటికాలిపై లేస్తున్నారు. ముందు కవిత అడిగే ప్రశ్నలకు సమాధానం చెప్పాలని వారు డిమాండ్ చేస్తున్నారు. ఫోన్ ట్యాపింగ్ విషయంలోనూ తన ఫోన్ తో పాటు తన కుటుంబ సభ్యుల ఫోన్లు కూడా ట్యాప్అయి ఉంటాయని కవిత చేసిన వ్యాఖ్యలు కేటీఆర్ కు ఇబ్బందికరంగా మారాయి.

**కాంగ్రెస్ పై కాలుదువ్వుతుంటే...**

కాంగ్రెస్ పై కాలుదువ్వుతూ ముందుకు వెళదామని అనుకుంటే.. కవిత రూపంలో కాళ్లకు అడ్డంపడుతుదని అంటున్నారు. కల్వకుంట్ల కవిత తన సోదరుడితో రాజకీయంగా దూరమయ్యారు. ఆమె కనీసం తెలంగాణ భవన్ కు కూడా రావడం లేదు. అలాగే కేటీఆర్ కూడా కవిత పట్ల కఠిన వైఖరిని అవలంబిస్తున్నారని, ఆమె జాగృతి తరుపున చేసే కార్యక్రమాలకు బీఆర్ఎస్ నేతలు ఎవరూ వెళ్లవెద్దని ఆంక్షలు పెడుతున్నారని కవిత సన్నిహితులు ఆరోపిస్తున్నారు. తాను కేసీఆర్ నాయకత్వంలోనే పనిచేస్తానని, మరొకరి లీడర్ షిప్ తనకు అవసరం లేదని కవిత తెగేసి చెబుతున్నారు. కవిత, కేటీఆర్ ఉప్పునిప్పులా మారడంతో పాటు పార్టీతో పాటు ఇతర కార్యక్రమాలను వేర్వేరుగా నిర్వహిస్తున్నారు.

**కేసీఆర్ జోక్యం చేసుకోరా?**

బీఆర్ఎస్ ను బీజేపీలో కలిపిందుకు కుట్ర జరుగుతుందని, దానిని తాను అడ్డుకున్నానని గతంలో కవిత రాసిన లేఖ సంచలనమే అయింది. తాజాగా సీఎం రమేష్ చేసిన వ్యాఖ్యలు కూడా కవితకు ప్లస్ గా మారాయి. తాను చెప్పిందేనిజమని ఆమె సన్నిహితుల వద్ద వ్యాఖ్యానిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే కేటీఆర్ బయటకు చెప్పకపోయినా కవిత పట్ల ఇప్పుడు కఠినంగా వ్యవహరించకుంటే భవిష్యత్ లో కష్టమేనని భావించి రానున్న కాలంలో పార్టీ పదవుల విషయంలో తన వర్గం వారికే ప్రాధాన్యత ఇచ్చేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇదే సమయంలో కేసీఆర్ కూడా ఇద్దరి మధ్య సయోధ్యకు పెద్దగా ప్రయత్నించకపోవడం కూడా రాజకీయంగా చర్చనీయాంశమైంది. కుటుంబ పెద్దగా ఇద్దరినీ కూర్చోబెట్టి ఇద్దరి మధ్య తలెత్తిన విభేదాలను తొలగించే ప్రయత్నం చేయాలని పార్టీ నేతలతో పాటు క్యాడర్ కోరుకుంటున్నారు. ఇద్దరి మధ్య తాము నలిగిపోతున్నామని చెబుతున్నారు.

# వేగవంతమైన ట్రాన్స్ ఫర్మేషన్ కోసం
# సింగపూర్ తో కలిసి పనిచేస్తాం

- మొదటి పేజీ తరువాయి

ఆవిష్కరణలకు కేంద్రంగా ఆంధ్రప్రదేశ్

ఆంధ్రప్రదేశ్‌ను ఆవిష్కరణలకు కేంద్రంగా, శ్రామిక శక్తి పరివర్తనలో అగ్రగామిగా నిలబెట్టేందుకు తమ ప్రభుత్వం కృషి చేస్తోందని లోకేశ్ తెలిపారు. యువతను కేవలం ఉద్యోగాల కోసం మాత్రమే కాకుండా, భవిష్యత్తుకు అవసరమైన నైపుణ్యాలతో సిద్ధం చేస్తున్నామని చెప్పారు. అంతర్జాతీయ సాంకేతిక మార్పులకు అనుగుణంగా రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాల్లో నైపుణ్యాభివృద్ధి కోర్సులను ప్రవేశపెడుతున్నామని, సంప్రదాయ విద్యా విధానానికి స్వస్తి పలకాలని, పాఠ్యప్రణాళికలో సమూల మార్పులు తీసుకురావాలని పిలుపునిచ్చారు. పరిశోధన, ఆవిష్కరణలు, విద్యార్థి మార్పిడి కార్యక్రమాలు, వ్యవస్థాపకతపై సింగపూర్ విశ్వవిద్యాలయాలతో కలిసి పనిచేయడానికి ఆంధ్రప్రదేశ్ సిద్ధంగా ఉందని ఆయన ప్రకటించారు.

**సింగపూర్ నుంచి పాఠాలు: నిరంతర అభ్యాసం మరియు నైపుణ్య విశ్వవిద్యాలయాలు**

నైపుణ్యాన్ని ఉపయోగించుకోవడం, శ్రామిక శక్తి అభివృద్ధి, ముఖ్యంగా జీవితకాల అభ్యాస రంగంలో సింగపూర్ ప్రపంచవ్యాప్తంగా అగ్రగామిగా ఉందని లోకేశ్ ప్రశంసించారు. నాన్యాంగ్ టెక్నలాజికల్ యూనివర్సిటీ (%చీఖ%), సింగపూర్ యూనివర్సిటీ ఆఫ్ సోషల్ సైన్సెస్ (%ాఖూా%) వంటి సంస్థలు నిరంతర విద్య, నైపుణ్యాల పెంపుదలకు ప్రాధాన్యత ఇచ్చే కార్యక్రమాలను ప్రారంభించాయని ఆయన గుర్తు చేశారు. %చీఖ%లో అసోసియేట్ ప్రొఫెసర్ సియా సీవ్ కీన్, %ాఖూా%లో డాక్టర్ యాప్ మీన్ షెంగ్ అభివృద్ధి చేసిన నమూనాల మాదిరిగానే ఆంధ్రప్రదేశ్‌లో జీవితకాల అభ్యాసంపై దృష్టి సారించే నైపుణ్య విశ్వవిద్యాలయాలను స్థాపించే ప్రక్రియను ప్రారంభించినట్లు మంత్రి తెలిపారు.

**పరిశ్రమ-విద్యా సంస్థల సహకారం: నైపుణ్య అంతరాన్ని తగ్గించడం**

సింగపూర్ విద్యా వ్యవస్థ బలాల్లో పరిశ్రమ-విద్యా రంగ సహకారం ముఖ్యమైందని లోకేశ్ పేర్కొన్నారు. సింగపూర్ మేనేజ్‌మెంట్ యూనివర్సిటీ (%ావీఖ%), సింగపూర్ యూనివర్సిటీ ఆఫ్ టెక్నాలజీ అండ్ డిజైన్ (%ాఖుణ%) వంటి సంస్థలు పరిశ్రమ అవసరాలను తమ పాఠ్యాంశాల్లో విజయవంతంగా చేర్చాయని, విద్యార్థులు విద్యాపరంగా నైపుణ్యం కలిగి ఉండటమే కాకుండా పరిశ్రమలకు సిద్ధంగా ఉండేలా తయారుచేస్తున్నాయని ఆయన వివరించారు. ఆంధ్రప్రదేశ్‌లోని విశ్వవిద్యాలయాలు, పరిశ్రమలు సంయుక్తంగా పాఠ్యాంశాలు, ఇంటర్న్‌షిప్‌లు, పరిశోధన ప్రాజెక్టులను రూపొందించేలా ఇండస్ట్రీ-విద్యారంగ కన్సార్టియం ఏర్పాటు చేయడానికి కృషి చేస్తున్నామని లోకేశ్ తెలిపారు. విద్యారంగం, పరిశ్రమల మధ్య అంతరాన్ని తగ్గించే నమూనాలను అభివృద్ధి చేయడానికి %ావీఖ, ాఖుణ%లతో కలిసి పనిచేయడానికి ఆసక్తిగా ఉన్నామని ఆయన వెల్లడించారు.

**నైపుణ్యాభివృద్ధి మిషన్ మరియు అంతర్జాతీయ భాగస్వామ్యాలు**

సింగపూర్‌లోని స్కిల్స్‌ఎస్‌జి వెంచర్స్ పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను రూపొందించడంలో కీలక పాత్ర పోషించిందని లోకేశ్ పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ఐటీ, ఎలక్ట్రానిక్స్, ఉద్భవిస్తున్న సాంకేతికతలు వంటి రంగాలలో యువతలో నైపుణ్యాన్ని పెంపొందించేందుకు నైపుణ్యాభివృద్ధి మిషన్‌ను అమలు చేస్తున్నామని ఆయన తెలిపారు. తమ పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను అభివృద్ధి చేయడానికి స్కిల్స్‌ఎస్‌జి వెంచర్స్ సహకారాన్ని కోరుతున్నామని లోకేశ్ ప్రకటించారు. ఈ రౌండ్ టేబుల్ కాన్ఫరెన్స్‌లో నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ సింగపూర్ రిజిస్ట్రార్ ఆర్. రాజారామ్, నన్యాంగ్ టెక్నాలజీ యూనివర్సిటీ అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ సియా స్యూ, సింగపూర్ మేనేజ్‌మెంట్ యూనివర్సిటీ ప్రొఫెసర్ ప్రదీప్ రెడ్డి, సింగపూర్ యూనివర్సిటీ ఆఫ్ టెక్నాలజీ అండ్ డిజైన్ చైర్ ప్రొఫెసర్ రాజేష్ ఎలర మోహన్, సింగపూర్ యూనివర్సిటీ ఆఫ్ సోషల్ సైన్స్ అసోసియేట్ ప్రొఫెసర్ యాప్ మీన్ షెంగ్, స్కిల్ ఎస్ఎస్ జి వెంచర్స్ బిజినెస్ డెవలప్‌మెంట్ డైరెక్టర్లు చెన్, హాంగ్ సియాంగ్ పాల్గొన్నారు.

### వాడీవేడిగా ఆపరేషన్ సిందూర్ పై చర్చ...
# విపక్షాలపై భగ్గుమన్న రాజ్ నాథ్ సింగ్

- మొదటి పేజీ తరువాయి

రాజ్‌నాథ్ సింగ్ ఆపరేషన్ సిందూర్ విజయాన్ని గట్టిగా నొక్కి చెప్పారు. ఈ ఆపరేషన్‌లో ఒక్క భారతీయ సైనికుడికి కూడా హాని జరగలేదని ఆయన స్పష్టం చేశారు. “భారత సైన్యం ఎన్ని శత్రు విమానాలను కూల్చివేసింది? ఉగ్రవాద స్థావరాలు ధ్వంసం అయ్యాయా?” వంటి ప్రశ్నలు విపక్షం ఎందుకు అడగలేదని ఆయన ప్రశ్నించారు. ఒకవేళ ఈ వారు ఈ ప్రశ్నలు అడిగితే తమ వద్ద స్పష్టమైన సమాధానాలు ఉన్నాయని అన్నారు. జాతీయ భద్రతపై దృష్టి సారించాలని, సాయుధ దళాల స్థైర్యాన్ని దెబ్బతీయవద్దని ఆయన ప్రతిపక్షానికి సూచించారు. ఆపరేషన్ విజయం గురించి ఇప్పటికే తెలియజేసినట్లు ఆయన పునరుద్ఘాటించారు. ప్రతిపక్షం ప్రజా సమస్యలకు సంబంధించిన అర్థవంతమైన, బాధ్యతాయుతమైన ప్రశ్నలు అడగడమే వారి పాత్ర అని సింగ్ అన్నారు.

### ఇప్పటికీ జగన్ మారలేదు...
# కంపెనీలు రాకుండా అడ్డుకుంటున్నారు

- మొదటి పేజీ తరువాయి

వ్యక్తం చేశారు. ప్రజలు చెప్పినా వీళ్ల బుద్ధి మారడం లేదని, రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి-సంక్షేమం చూసి ఓర్వలేకపోతున్నారని విమర్శించారు.

# మోదీ, ట్రంప్ మధ్య ఫోన్ సంభాషణ జరగలేదు!

- మొదటి పేజీ తరువాయి

ఎవరైనా ఊహించారా అని ప్రశ్నించారు. పాక్ ఎదురుదాడులను సమర్థంగా ఎదుర్కొన్న తర్వాత దాడులు నిలిపివేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు అటు నుంచి ఫోన్లు వచ్చాయని తెలిపారు. కానీ డీజీఎంవో నుంచి విజ్ఞప్తి రావాలని తాము తేల్చి చెప్పామని అన్నారు. పహల్గామ్ ఉగ్రదాడికి కారణమైన టీఆర్ఎఫ్‌ను అమెరికా ఉగ్రవాద సంస్థగా ప్రకటించిందని గుర్తు చేశారు. పహల్గామ్ ఉగ్ర దాడి ఘటనను ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి, క్వాడ్, బ్రిక్స్‌తో పాటు వివిధ దేశాలు ఖండించాయని తెలిపారు. ఐక్యరాజ్యసమితిలోని 193 దేశాల్లో మూడు మాత్రమే పాకిస్థాన్‌కు అనుకూలంగా ఉన్నాయని వెల్లడించారు.

పాకిస్థాన్, చైనాల పరస్పర సహకారం ఆరు దశాబ్దాలుగా కొనసాగుతోందని వ్యాఖ్యానించారు. చైనాతో వ్యవహరించాల్సిన తీరుపై ప్రతిపక్షాలు ఉపన్యాసాలు ఇవ్వడం విడ్డూరంగా ఉందని అన్నారు. ఒలింపిక్స్‌లో పాల్గొనడానికో, రహస్య ఒప్పందాలు చేసుకోవడానికే తాము చైనాకు వెళ్లలేదని ఎద్దేవా చేశారు. తాను చైనాకు వెళ్లింది తీవ్రవాదం మన పంథా వివరించేందుకు, వాణిజ్య ఒప్పందాల గురించేనని చెప్పారు.

# వీఐపీలు ఏడాదికోసారి మాత్రమే శ్రీవారిని దర్శించుకోవాలి

- మొదటి పేజీ తరువాయి

తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ క్రమంలో మీడియాతో మాట్లాడుతూ.. ఆలయంలో స్వామివారి దర్శనానికి ఉండే స్థలం, సమయం పరిమితంగా ఉండటంతో బయట ఎంత మంచి ఏర్పాట్లు చేసినా రద్దీ కారణంగా భక్తులు ఇబ్బంది పడుతున్నారని అన్నారు వెంకయ్య నాయుడు.

సామాన్య భక్తులను దృష్టిలో ఉంచుకొని వీఐపీలు ఏడాదికి ఒకసారి మాత్రమే పరిమిత సంఖ్యలో కుటుంబ సభ్యులతో శ్రీవారిని దర్శించుకోవాలని.. అప్పుడే దేవస్థానం నిర్వహణకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఉంటుందని అన్నారు. ప్రజా ప్రతినిధులంతా బాధ్యతతో హుందాగా తన సూచనను పాటించాలని కోరారు వెంకయ్య నాయుడు. సామాన్య భక్తులు

# భారత్-పాకిస్థాన్ సహా ఆరు యుద్ధాలు ఆపేశాను

- మొదటి పేజీ తరువాయి

యుద్ధం విస్తరించడం, అణుధూళి వ్యాప్తి వంటి ఘోర పరిస్థితులు ఉండేవి. భారత్, పాక్ దేశాలకు చెందిన నేతలు నాకు బాగా తెలుసు. యుద్ధం చేసుకోవాలనుకుంటే వాణిజ్య ఒప్పందాలు కుదుర్చుకోనని స్పష్టం చేశాను” అని పునరుద్ఘాటించారు. భారత్-పాక్ యుద్ధాన్ని తానే ఆపానని ట్రంప్ ఇదివరకే పలుమార్లు వ్యాఖ్యానించారు.

# తెలంగాణ హైకోర్టుకు నలుగురు అదనపు జడ్జిల నియామకం

- మొదటి పేజీ తరువాయి

న్యాయమూర్తులు, అదనపు న్యాయమూర్తుల నియమకానికి రాష్ట్రపతి ద్రౌపది ముర్మ ఆమోదం తెలిపారు. సుప్రీంకోర్టు కొలీజియం పలువురు న్యాయవాదులు, జ్యుడీషియల్ ఆఫీసర్లను న్యాయమూర్తులుగా, అదనపు న్యాయమూర్తులుగా నియమించాలని సిఫార్సు చేసింది. దీనికి రాష్ట్రపతి ఆమోదముద్ర వేశారు. ఈ మేరకు కేంద్ర మంత్రి అర్జున్ రామ్ మేఘవాల్ ప్రకటన విడుదల చేశారు. నియామకం పొందిన 19 మందిలో తెలంగాణ హైకోర్టుకు నలుగురు అదనపు న్యాయమూర్తులుగా గౌస్ మీరా మొహియుద్దీన్, చలపతిరావు సుద్దాల, వాకిటి రామకృష్ణారెడ్డి, గడి ప్రవీణ్ కుమార్ నియమితులయ్యారు. వీరితో పాటు మధ్యప్రదేశ్ హైకోర్టుకు ఏడుగురు న్యాయమూర్తులు, నలుగురు అదనపు న్యాయమూర్తులు, గౌహతి హైకోర్టుకు నలుగురు న్యాయమూర్తులు నియమితులయ్యారు.

# పోలవరం-బనకచర్ల ప్రాజెక్టుపై కేంద్ర ప్రభుత్వం కీలక ప్రకటన

- మొదటి పేజీ తరువాయి

తెలియజేసింది. రాజ్యసభలో కాంగ్రెస్ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్ అడిగిన ప్రశ్నకు కేంద్ర జల్ శక్తి శాఖ లిఖితపూర్వక సమాధానం ఇచ్చింది. సాంకేతిక, ఆర్థిక అంచనా కోసం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రీ ఫీజిబిలిటీ నివేదికను కేంద్ర జల సంఘానికి అందించినట్లు తెలిపింది. ఈ ప్రాజెక్టుపై తెలంగాణ ప్రభుత్వం అభ్యంతరాలు లేవనెత్తుతూ లేఖ రాసినట్లు పార్లమెంటుకు తెలిపింది. ప్రాజెక్టుపై సంబంధిత అధికారులు, పరివాహక ప్రాంత రాష్ట్రాలతో సంప్రదింపులు జరుపుతున్నట్లు తెలిపింది.

# పీ4 పథకంపై స్పష్టత ఇచ్చిన వైస్ ఛైర్మన్ సి.కుటుంబరావు

- మొదటి పేజీ తరువాయి

పార్ట్నర్‌షిప్ (ప్రోగ్రాం) ను ఘనంగా ప్రారంభించారు. ఈ పథకం ద్వారా సమాజంలో ఆర్థికంగా బలంగా ఉన్న వారు స్వచ్ఛందంగా అట్టడుగునున్న కుటుంబాలు, వ్యక్తులు, గ్రామాల అభివృద్ధిలో తోడ్పడే అవకాశాన్ని కల్పిస్తోంది. అయితే ఈ పీ-4 విధానంపై ఉన్న అపోహలు, ఆరోపణలపై స్వర్ణాంధ్ర పీ-4 ఫౌండేషన్ వైస్ ఛైర్మన్ సి.కుటుంబరావు వివరణ ఇచ్చారు.

**పీ4 పథకం లక్ష్యం**

సమాజంలో ఎవరైతే బాగా ఆర్థికంగా బలంగా ఎదిగారో, వారు అట్టడుగున ఉన్న బడుగు వర్గాలకు సహాయం అందిస్తే అసమానతలు తొలగుతాయి, సమాజంలో సమానత్వం నెలకుంటుంది. ప్రతి ఒక్కరూ వెల్తీ, హెల్దీ, హ్యాపీ ఆంధ్రప్రదేశ్ పౌరులుగా జీవించగలుగుతారు. ఈ ఉద్దేశంతో ప్రభుత్వం ఒక సర్వే నిర్వహించి ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి చెందాల్సిన కుటుంబాలను బంగారు కుటుంబాలుగా గుర్తించింది. సహాయం చేయగల సామర్థ్యం ఉన్నవారిని మార్గదర్శకులుగా గుర్తించి నమోదు చేసింది. ఈ పథకం పూర్తిగా వాలంటరీ, అంటే స్వచ్ఛం దమే. ఎవరూ ఎవరినీ బలవంతంగా ఇందులో చేర్చడం లేదు.

**పీ4 పై ఆరోపణలు అవాస్తవం**

ఇటీవల కొన్ని విపక్షాలు, కొంతమంది వ్యక్తులు పీ4 పథకంపై తప్పుడు ప్రచారం చేస్తున్నారు. డీఈవో (డిస్ట్రిక్ట్ ఎడ్యుకేషన్ ఆఫీసర్) గారు హెడ్ మాస్టర్లు, టీచర్లను మార్గదర్శకులుగా ఎన్ రోల్ కావాలని బలవంతం చేస్తున్నారనే ఆరోపణలు అవాస్తవం. ఎటువంటి అధికార ఆదేశాలు విడుదల కాలేదు. ఎవరికి ఇష్టమైతే వారు మాత్రమే ఈ కార్యక్రమంలో పాలుపంచుకోవచ్చు. ఇలాంటి మంచి కార్యక్రమంలో అవాస్తవాలకు తావు ఇవ్వొద్దు. ఎవరైనా బలవంతం చేస్తే, దయచేసి సంబంధిత అధికారులకు లేదా ప్రభుత్వానికి సమాచారం ఇవ్వగలరు.

**మార్గదర్శకులకు ఆదర్శం సీఎం చంద్రబాబు**

ఇప్పటికే 50,000 మందికి పైగా మార్గదర్శకులు స్వచ్ఛందంగా నమోదు అయ్యారు. 6 లక్షల బంగారు కుటుంబాలు గుర్తించబడ్డాయి. మార్గదర్శకులు కూడా వారిని దత్తత తీసుకుంటున్నారు. స్వయంగా ముఖ్యమంత్రి చంద్రబాబు 250 కుటుంబాలను దత్తత తీసుకొని పీ4 పథకానికే ఆదర్శంగా నిలిచారు. భారతదేశం ప్రపంచంలోనే వేగంగా అభివృద్ధి చెందుతున్న దేశంగా, ప్రపంచ స్థాయిలో బిలియనర్లు ఎదుగుతున్న దేశంగా గుర్తింపు పొందుతోంది. అధిక శాతం బిలియనర్లు మన దేశస్థులే. అయితే వారితో పాటు అట్టడుగున ఉన్నవారిని ఆర్థికంగా, సామాజికంగా మెరుగుపరచాల్సిన బాధ్యత ఆ బిలియనర్ల బాధ్యత. ఇందుకే ప్రభుత్వం వారిని స్వచ్ఛందంగా ఈ పథకంలో భాగం కావాలని కోరుతోంది. అలాగే, పీ4 పథకంలో పాల్గొంటున్న ప్రభుత్వాధికారులు అందరూ కూడా దీన్ని వాలంటరీ ప్రోగ్రామ్‌గా మాత్రమే చూడాలని, ఎటువంటి బలవంతం లేకుండా పని చేయాలని ప్రభుత్వం స్పష్టం చేస్తోంది... అని కుటుంబరావు వెల్లడించారు.

# క్రీడలతో పర్యాటక, వాణిజ్య రంగాల వృద్ధి సాధ్యం: సింగపూర్ స్పోర్ట్స్ స్కూల్లో సీఎం చంద్రబాబు

క్రీడలతోనూ పర్యాటక-వాణిజ్య రంగాల్లో వృద్ధి సాధ్యమని...అందుకే ఆంధ్రప్రదేశ్‌లో క్రీడలకు అత్యధిక ప్రాధానత్య ఇస్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. అత్యుత్తమ క్రీడాకారుల్ని తయారు చేయటంతో పాటు క్రీడా సదుపాయాలు, పెట్టుబడులను ఆకర్షించేలా ఏపీ స్పోర్ట్స్ పాలసీ తీసుకువచ్చామని అన్నారు. సోమవారం నాడు సింగపూర్ పర్యటనలో రెండో రోజున సీఎం చంద్రబాబు ప్రముఖ బ్యాడ్మింటన్ కోచ్ పుల్లెల గోపిచంద్, మంత్రులు, అధికారులతో కలిసి సింగపూర్ స్పోర్ట్స్ స్కూలును సందర్శించారు. అత్యుత్తమ క్రీడాకారులను తయారు చేయటంతో పాటు వినోదం, పర్యాటకం, వాణిజ్య కార్యకలాపాలకు కేంద్రాలుగా స్పోర్ట్స్ స్కూళ్లు ఉండాలని సింగపూర్ స్పోర్ట్స్ స్కూల్ ప్రిన్సిపాల్ ఓంగ్ కిమ్ సూన్‌తో ముఖ్యమంత్రి అన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో అంతర్జాతీయ క్రీడాకారులను తయారు చేయాలన్న సంకల్పంతో తాము పెద్దఎత్తున ప్రోత్సాహకాలు ఇస్తున్నట్టు చెప్పారు.

ఏపీలో ప్రభుత్వ ఉద్యోగాల్లో ఉన్న క్రీడా రిజర్వేషన్లను 2 నుంచి 3 శాతానికి పెంచామని, అలాగే ఒలింపిక్స్, ఏషియన్ గేమ్స్, వరల్డ్ చాంపియన్ షిప్స్, నేషనల్ గేమ్స్ లో పతకాలు సాధించిన వారికి ఇచ్చే ప్రోత్సాహకాన్ని భారీగా పెంచామన్నారు. ఒలంపిక్స్‌లో బంగారు పతకం సాధించిన వారికి రూ.7 కోట్లు, రజతం సాధిస్తే రూ.5 కోట్లు, కాంస్య పతకం పొందిన వారికి రూ.3 కోట్లు ఇస్తున్నట్టు చెప్పారు. ఒలింపిక్, ఏషియన్ గేమ్స్‌లో పతకాలు సాధించిన వారికి గ్రూప్-1 ఉద్యోగాలు ఇస్తున్నట్టు ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

# చంద్రబాబు వల్లే సింగపూర్‌లో ఉన్నా.. ఏపీకి రోల్స్ రాయిస్ తెస్తా..



ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు సింగపూర్ పర్యటన అత్యంత ఉత్సాహభరితంగా సాగుతోంది. వన్ ఇంటర్నేషనల్ స్కూల్ ఆడిటోరియంలో ఆదివారం నిర్వహించిన తెలుగు డయాస్పోరా సౌత్ ఈస్ట్ ఏషియా కార్యక్రమంలో ఓ ఆసక్తికర సంఘటన చోటు చేసుకుంది. దాదాపు ఐదు గంటల పాటు జరిగిన ఈ కార్యక్రమంలో సింగపూర్‌తో సహా పక్కనే ఉన్న మరో ఐదు దేశాల నుంచి ప్రవాసాంధ్రులు పెద్దఎత్తున తరలివచ్చారు. ఊహకుమించిన స్థాయిలో తెలుగు వారు రాకతో ఆడిటోరియం నిండిపోయింది. తెలుగు ప్రజల ఆనందం, సంతోషాల నడుమ సుమారు ఐదు గంటల పాటు పండుగలా డయాస్పోరా కార్యక్రమం వీడియోలు వైరల్ అవుతున్నాయి. అయితే ఈ సందర్భంగా ఓ తెలుగు మహిళా టెకీతో ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడిన మాటలు నెట్టింట వైరల్ అవుతున్నాయి.

**బాబు విజన్ తో సింగపూర్ వచ్చా..**

4వ సారి ముఖ్యమంత్రిగా విజయం సాధించిన తర్వాత తొలిసారి సింగపూర్‌కు సీఎం చంద్రబాబు వస్తున్నారన్న సమాచారంతో భార్యా పిల్లలు, స్నేహితులతో కలిసి ఎన్ఆర్ఐలు డయాస్పోరాకు భారీగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారిని ఉద్దేశించి ముఖ్యమంత్రి ప్రసంగించారు. అనంతరం వారి అభిప్రాయాలను, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ క్రమంలో రోల్స్ రాయిస్ కంపెనీలో ఏఐ హెడ్‌గా పనిచేస్తున్న ఓ మహిళ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు విజన్ వల్లే తాము ఈ రోజు ఈ స్థితికి వచ్చామని ఆనందంగా వెల్లడించారు. దీంతో సభలో అంతా చప్పట్లు కొట్టి హర్షం ప్రకటించారు.

**ఏపీకి రోల్స్ రాయిస్ కంపెనీ తీసుకువస్తా..**

తెలుగు డయాస్పోరా కార్యక్రమానికి వచ్చిన ఆ మహిళా టెకీ చంద్రబాబు పనితీరుపై అభినందనలు తెలిపారు. గతంలో ఆయన ముందు చూపుతో తీసుకున్న నిర్ణయాల వల్లే తనలాంటి టెకీలు ప్రపంచ ప్రతిష్టాత్మక కంపెనీల్లో పనిచేస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా తన కంపెనీ యాజమాన్యంతో మాట్లాడి ఆంధ్రప్రదేశ్ లో పెట్టుబడులు పెట్టేలా కృషి చేస్తానని ఆమె హామీ ఇచ్చారు. దీనిపై ముఖ్యమంత్రి చంద్రబాబు కూడా హర్షం ప్రకటించారు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలుగు వారు ఏపీ అభివృద్ధికి చేదోడుగా నిలవాలని పిలుపునిచ్చారు. అదేసమయంలో పేదరిక నిర్మూలన కోసం తాను ప్రవేశపెట్టిన పీ-4 పథకంలో చేరి తోటివారికి సహాయం చేయాలని ఆ మహిళా ఉద్యోగిని కోరారు. దీనికి ఆమె అంగీకరిస్తున్నట్లు తెలపడం విశేషం. ఇలా సింగపూర్ లో జరిగిన తెలుగు డయాస్పోరా సమావేశం మంచి ఫలితాలను ఇచ్చిందని ప్రభుత్వ వర్గాలు ఆనందం వ్యక్తం చేస్తున్నాయి.

# ప్రపంచ ప్రఖ్యాత షావోలిన్ టెంపుల్ అధినేత తప్పుడు పనులు



షావోలిన్ టెంపుల్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. "మార్షల్ ఆర్ట్స్" అన్న మాట తెలిసిన ప్రతి ఒక్కరికి షావోలిన్ టెంపుల్ గురించి తెలిసి ఉండటమే కాదు.. తమ జీవితకాలంలో ఒక్కసారైనా అక్కడకు వెళ్లాలని అనుకోవటం కనిపిస్తుంది. ప్రపంచ ప్రఖ్యాత మార్షల్ ఆర్ట్స్ లో ఒకటైన కుంగ్ ఫూ కు పుట్టినిల్లుగా.. దాని శిక్షణకు అంతకు మించిన ప్రదేశం మరొకటి లేదన్న పేరు ప్రఖ్యాతులు షావోలిన్ సొంతం. చైనాలోని హెనాన్ ప్రావిన్సులో ఉండే షావోలిన్ టెంపుల్ ను క్రీస్తు శకం 495లో స్థాపించారు. సాంగ్ పర్వత దిగువన ఈ ప్రసిద్ధ క్షేత్రం ఉంది. 1500 ఏళ్ల చరిత్ర ఉన్న ఈ టెంపుల్ కు చారిత్రక ప్రాధాన్యత మాత్రమే కాదు.. అంతకు మించిన మతపరమైన ప్రాముఖ్యత ఉంది. మార్షల్ ఆర్ట్స్ కు ఎంతో ఫేమస్ అయిన ఈ టెంపుల్ కు.. ప్రపంచ వ్యాప్తంగా ఎంతోమంది విద్యార్థులు ఇక్కడకు వచ్చి కుంగ్ ఫూ శిక్షణ తీసుకుంటూ ఉంటారు. పర్యాటకంగానూ ఎంతో ప్రాచుర్యం పొందిన షావోలిన్ టెంపుల్ కు అధినేతగా ఉండే గురువు తప్పుడు పనులు తాజాగా తెర మీదకు వచ్చి సంచలనంగా మారాయి.

షావోలిన్ టెంపుల్ కు అధిపతిగా వ్యవహరిస్తున్న షి యోంగ్క్సిన్ వ్యవహారశైలిపై పలు తీవ్రమైన ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. చాలా రోజులుగా అనేక మంది మహిళలతో లైంగిక సంబంధాలు మాత్రమే కాదు.. అక్రమంగా ఒక చిన్నారికి తండ్రి అయినట్లుగా గుర్తించిన వైనం కలకలాన్ని రేపుతోంది. అతడు చేసిన పనులన్నీ బౌద్ధ సూత్రాల్ని ఉల్లంఘించినట్లుగా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అతడ్ని పలు విభాగాల అధికారులు విచారిస్తున్నారు. దీనికి సంబంధించిన వివరాల్ని త్వరలో షేర్ చేస్తామని చెబుతున్నారు. నిధుల దుర్వినియోగంతో పాటు.. అక్రమంగా ఆస్తుల్ని కూడబెట్టటం.. పలువురు మహిళలతో లైంగిక సంబంధాలు కలిగి ఉన్న వైనం తీవ్ర కలకలానికి కారణంగా మారింది. చైనాలోని ప్రసిద్ధ బౌద్ధ సన్యాసుల్లో ఒకరుగా గుర్తింపు పొందిన ఇతగాడి మీద గతంలోనూ పలు ఆరోపణలు ఉన్నట్లుగా చెబుతున్నారు

1999లో సావోలిన్ టెంపుల్ కు అధిపతిగా నియమితులైన అతడు.. ఆ ప్రాంతాన్ని డెవలప్ చేయటంతో అతడ్ని సీఈవో మాంక్ గా పేర్కొనేవారు. ఎంబీఏ బ్యాక్ గ్రౌండ్ ఉన్న అతను.. ఆస్ట్రేలియాలో కోట్లాది రూపాయిలు విలువ చేసే ఆలయాన్ని.. ఒక హోటల్ ను.. కుంగ్ ఫూ అకాడమీతో పాటు.. గోల్ఫ్ కోర్స్ నిర్మించాలన్న ప్రణాళిక వివాదాస్పదంగా మారిన వైనం తెలిసిందే. ఎంతో గౌరవ స్థానంలో ఉన్న బౌద్ధ గురువు ఇలాంటి తప్పుడు పనులు చేయటం.. అవన్నీ బయటకు రావటం ఇప్పుడు షాకింగ్ గా మారింది.

## షటిల్ ఆడుతూ గుండెపోటుతో యువకుడి మృతి..

ఇటీవల కాలంలో డాన్స్ చేస్తూ, క్రికెట్ ఆడుతూ, కుర్చీలో కూర్చుని సేదతీరుతూ కూడా అకస్మాత్తుగా గుండెపోటుకు గురై చాలా మంది వ్యక్తులు మృతి చెందిన ఘటనలు తెరపైకి వచ్చిన సంగతి తెలిసిందే. అయితే అందుకు కారణం కరోనా వైరస్ అనే చర్చా నడిచింది. ఇటీవల దీనిపై ఐ.సీ.ఎం.ఆర్ క్లారిటీ ఇచ్చింది. ఈ క్రమంలో షటిల్ ఆడుతూ 25 ఏళ్ల వ్యక్తి మృతి చెందిన షాకింగ్ ఘటన తెరపైకి వచ్చింది. అవును... ఇటీవల కాలంలో ప్రధానంగా యువకులు ఉన్నపలంగా గుండె పోటుతో మృతి చెందుతున్న ఘటనలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో తాజాగా హైదరాబాద్ లో అలాంటి ఒక సంఘటన జరిగింది. ఇందులో భాగంగా... 25 ఏళ్ల ఆరోగ్యవంతమైన వ్యక్తి.. కాక్ తీసుకోవడానికి వంగిన కొన్ని క్షణాల తర్వాత అకస్మాత్తుగా కోర్టులో కుప్పకూలిపోయాడు. వివరాల్లోకి వెళ్తే... తాజాగా హైదరాబాద్ లోని నాగోల్ ప్రాంతంలోగల ఒక ప్రైవేట్ షటిల్ కోర్టులో ఆడుతున్నాడు గుండ్ల రాకేష్ (25) అనే వ్యక్తి. అతడు ఒక ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడని తెలుస్తోంది. ఈ క్రమంలో ఆదివారం రాత్రి 8 గంటల ప్రాంతంలో అతడు షటిల్ ఆడుతూ ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. దీంతో... సహచరులు అతడిని ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడిని ఖమ్మం జిల్లా తల్లాడ మాజీ డిప్యూటీ సర్పంచ్ గుండ్ల వెంకటేశ్వర్లు కుమారుడుగా గుర్తించారని తెలుస్తోంది. ఈ ఘటనకు సంబంధించిన భయానక వీడియో ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ గా మారింది.

ఈ సమయంలో... యువకుడిగా, ఆరోగ్యంగా ఉన్న వ్యక్తి ఆకస్మిక మరణం.. ఆటలు ఆడటం, జిమ్ చేయడం వంటి శారీరక శ్రమల సమయంలో యువతలో గుండెపోటు వచ్చే ప్రమాదం ఉందనే ఆందోళన మరోసారి మొదలైంది. దీంతో... గుండె జబ్బుల లక్షణాలు ముందస్తుగా గుర్తించడంతోపాటు క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని నిపుణులు హెచ్చరిస్తున్నారు. కాగా... కోవిడ్ తర్వాత దేశంలో ఆకస్మిక మరణాలు.. ప్రధానంగా 40 ఏళ్ల లోపు వారు కూడా కార్డియాక్ అరెస్ట్ తో ప్రాణాలు కోల్పోతున్న ఘటనలు పెరిగిన సంగతి తెలిసిందే! దీనికంతటికీ కరోనా వ్యాక్సినే కారణమనే ప్రచారం జరిగింది.

# చాట్ జీపీటీ వెర్షన్ : చంద్రబాబు VS కేసీఆర్ VS జగన్.. ఎవరు నిజంగా యువత భవిష్యత్తును మారుస్తున్నారు?



తెలుగు రాష్ట్రాల రాజకీయ ముఖచిత్రంలో చంద్రబాబు నాయుడు, కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు, వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఈ ముగ్గురు నాయకులు తమదైన శైలిలో పాలనను నడిపిస్తున్నారు. అయితే, యువత భవిష్యత్తుకు ఎవరు మెరుగైన దారి వేస్తున్నారనే ప్రశ్న ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. నేటి ప్రపంచం కేవలం రోడ్లు, పెన్షన్లు, రేషన్లతో సరిపుచ్చుకునేది కాదు. కృత్రిమ మేధస్సు (%ూ×%), ఆటోమేషన్, డిజిటల్ ఇన్నొవేషన్‌లు భవిష్యత్తుకు దిశానిర్దేశం చేస్తున్నాయి. దేశం ముందుకు వెళ్లాలంటే యువతను గ్లోబల్ స్కిల్స్‌తో సిద్ధం చేయడం అత్యవసరం. ఈ నేపథ్యంలో ఈ ముగ్గురు నాయకుల విధానాలను చాట్ జీపీటీ విశ్లేషించింది. . అభివృద్ధి, సంక్షేమం, ఐటీ, విద్య వంటి రంగాల్లో వారి విధానాలు భిన్నంగా ఉన్నా, 21వ శతాబ్దపు అవసరాలకు అనుగుణంగా యువతను తీర్చిదిద్దడంలో ఎవరి విజన్ ఎంతవరకు ఉందని ఏఐ 'చాట్ జీపీటీ'ని ప్రశ్నించగా అది ఆసక్తికర సమాధానాన్ని విశ్లేషణను అందించింది. చాట్ జీపీటీ విశ్లేషణ ఎలా ఉందో తెలుసుకుందాం.

**చంద్రబాబు నాయుడు.. విజన్ విత్ టెక్నాలజీ**

చంద్రబాబు నాయుడుకు టెక్నాలజీ పట్ల ఉన్న విజన్ గురించి ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. హైదరాబాద్‌ను గ్లోబల్ ఐటీ హబ్‌గా మార్చిన ఘనత ఆయనకు దక్కుతుంది. 2024లో తిరిగి అధికారంలోకి వచ్చిన తర్వాత, విశాఖను ఫిన్‌టెక్ హబ్‌గా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో పనులు ప్రారంభమయ్యాయి. %ూ×% స్కిలింగ్ సెంటర్లు, గ్లోబల్ ఇన్వెస్టర్లను ఆకర్షించే ప్రయత్నాలు తిరిగి ఊపందుకున్నాయి. విదేశాల్లో ఉన్న తెలుగు యువత, ఇంజనీర్లు మాత్రం "బాబు వద్దే గ్లోబల్ దృష్టికోణం ఉంది" అని అభిప్రాయపడుతున్నారు. భవిష్యత్తు అవసరాలను ముందుగానే గుర్తించి, దానికి తగ్గ ప్రణాళికలు రచించడంలో చంద్రబాబుకు ఉన్న పట్టు యువతకు అనుకూలంగా మారుతుందన్నది చాట్ జీపీటీ వాదన.

**కేసీఆర్.. స్టార్టప్‌లు, ఐటీ, మెట్రో గ్లామర్**

తెలంగాణ ఏర్పడిన తర్వాత హైదరాబాద్‌లోని ఐటీ, స్టార్టప్ రంగాలు విస్తృతంగా వృద్ధి చెందాయి. టీ-హబ్ , టాస్క్, %ూ×% మిషన్ తెలంగాణ వంటి కార్యక్రమాలు యువతలో ఆత్మవిశ్వాసాన్ని పెంచాయి. అమెరికా, యూరప్‌లోని టెక్ కంపెనీలు హైదరాబాద్‌ను తమ పెట్టుబడులకు ఎంపిక చేసుకోవడం కేవలం యాదృచ్ఛికం కాదు, ఇది పాలనలో తీసుకున్న గణనీయమైన నిర్ణయాల ఫలితం. అయితే, ఈ వృద్ధి ఎక్కువగా పట్టణ కేంద్రాలకే పరిమితమవుతోందన్న విమర్శ ఉంది. గ్రామీణ యువతకు మాత్రం ఈ ప్రయోజనాలు తక్కువగానే కనిపిస్తున్నాయని చాట్ జీపీటీ ఆందోళన వ్యక్తం చేసింది.. పట్టణ, గ్రామీణ ప్రాంతాల మధ్య ఐటీ రంగంలో వృద్ధి అసమానతలు తెలంగాణలో ఒక సవాలుగా నిలుస్తున్నాయని చాట్ జీపీటీ తెలిపింది..

**జగన్ మోహన్ రెడ్డి.. సంక్షేమంపైనే ఫోకస్, స్కిల్స్‌కు గ్యాప్**

జగన్ పాలనలో వైఎస్సార్ చేయూత, వాలంటీర్లు, అమ్మఒడి వంటి సంక్షేమ పథకాలు గ్రామీణ, పేద ప్రజల్లో విశ్వాసాన్ని పెంచాయి. విద్యను ఉచితంగా అందించడం, ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలను మెరుగుపరచడం వంటి ప్రయత్నాలు ప్రశంసనీయం. అయితే, డిజిటల్ జాబ్స్, టెక్ స్కిల్స్, ఇన్నొవేషన్ ఎకోసిస్టంపై దృష్టి సారించడంలో కొంత వెనుకబడి ఉన్నారని చాట్ జీపీటీ అభిప్రాయపడింది. యువతకు ప్రపంచ స్థాయి శిక్షణ, ఐటీ ఉద్యోగాల్లో అవకాశం లేని స్థితిలో ఉన్నారనే ఆందోళన జగన్ పాలనలో వ్యక్తమైంది. సంక్షేమం ముఖ్యమైనదే అయినా, భవిష్యత్తుకు అవసరమైన నైపుణ్యాలను పెంపొందించడంపై మరింత దృష్టి సారించాలనేది చాట్ జీపీటీ కోరిక.

**ఎవరు నిజంగా యువత భవిష్యత్తును మారుస్తున్నారు?**

చంద్రబాబు: భవిష్యత్తు అవసరాలను ముందే అర్థం చేసుకుని, AI, ఫిన్ టెక్, డిజిటల్ స్కిల్స్ వంటి అంశాలపై దృష్టి పెట్టే నాయకుడు.

**కేసీఆర్ / కేటీఆర్:** ఇప్పటికే హైదరాబాద్‌ను గ్లోబల్ ఐటీ నెట్‌వర్క్‌లో స్థిరం చేసిన నాయకత్వం.

**జగన్:** పేదలకు విద్య, సంక్షేమం అందించినా, టెక్-ఫోకస్, నైపుణ్యాల పెంపుదలలో వెనుకబడిన పాలన.

ఈ మూడు అభిప్రాయాలను చాట్ జీపీటీ క్లుప్తంగా వ్యక్తపరిచింది.

చాట్ జీపీటీ ఎన్ని వివరణలు, విశ్లేషణలు ఇచ్చినా కూడా.. పాలకులు ఎవరనేది ముఖ్యం కాదు, వారి విజన్, దాని అమలు తీరు, యువతకు అందే ప్రత్యక్ష ప్రయోజనం ఎంత అన్నదే అసలైన విషయం. అసెంబ్లీలో ఎవరు పెద్దగా అరిచారనే దానికంటే, యువతను ఎవరు నిశ్శబ్దంగా భవిష్యత్ ప్రపంచానికి సిద్ధం చేస్తున్నారో మనం గమనించాలి. AI, డిజిటలైజేషన్, గ్లోబల్ మార్కెట్లు... ఇవన్నీ కొత్త శక్తులుగా మారుతున్న ఈ కాలంలో పాలకుడు ముందుచూపుతో ఉండాలి, దానిని సమర్థవంతంగా అమలు చేయగలగాలి . ఇప్పుడు యువత అడగాల్సిన ప్రశ్న "నా భవిష్యత్తు కోసం నా ఈ రోజు ఎవరు సిద్ధం చేస్తున్నారు?" అని.. ఈ ప్రశ్నకు సమాధానం దొరికితేనే తెలుగు రాష్ట్రాల యువత నిజమైన పురోగతిని సాధించగలదు.

# జగన్ దూకుడు.. గవర్నర్ తో కీలక భేటీ, ఎందుకంటే..?



మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి దూకుడు పెంచారు. లిక్కర్ స్కాంలో వైసీపీ నేతలు, గత ప్రభుత్వంలో కీలకంగా పనిచేసిన అధికారులను ప్రభుత్వ ఆదేశాలతో సిట్ అరెస్టు చేస్తున్న వేళ ఆయన కీలక నిర్ణయం తీసుకున్నారని ప్రచారం జరుగుతోంది. వైసీపీ కీలక నేత, రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి అరెస్టు తర్వాత నెక్స్ట్ ముఖ్య నేత అరెస్టు అన్న ప్రచారం జరుగుతున్న సమయంలో మాజీ సీఎం జగన్ రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ తో సమావేశం కానుండటం ఆసక్తికరంగా మారింది. మద్యం కేసులో మాజీ సీఎం జగన్ కు కిక్ బ్యాక్ అందిందని ఆరోపిస్తూ సిట్ అధికారులు కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారు. ఈ పరిస్థితుల్లో గవర్నరుతో జగన్ భేటీ కానుండటం ఉత్కంఠ రేపుతోంది.

**ప్రభుత్వంపై ఫిర్యాదు చేసేందుకే..**

మద్యం స్కాంపై చార్జిషీటులో మాజీ ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి పేరు ప్రస్తావించడంతో ఆయనను అరెస్టు చేస్తారా? అన్న చర్చ మొదలైంది. అయితే మాజీ ముఖ్యమంత్రిగా ఉన్న జగన్ ను అరెస్టు చేయాలంటే తప్పనిసరిగా గవర్నర్ అనుమతి తీసుకోవాల్సివుంది. మరోవైపు లిక్కర్ స్కాంలో తొలి చార్జిషీటు దాఖలు చేసిన సిట్ అనుబంధ చార్జిషీటు దాఖలకు మూడు వారాల సమయం కోరింది. ఈ నేపథ్యంలో మరో వారం పది రోజుల్లో ఈ గడువు ముగియనుంది. అంటే జగన్ విషయంలో గవర్నర్ నిర్ణయం కీలకంగా మారే పరిస్థితి కనిపిస్తోందని అంటున్నారు. దీంతో గవర్నర్ తో భేటీ కావాలని మాజీ సీఎం జగన్ నిర్ణయించడం రాజకీయంగా ఆసక్తి రేపుతోంది.

**గవర్నర్ తో భేటీ ఎందుకు?**

లిక్కర్ స్కాంపై చురుగ్గా దర్యాప్తు జరుగుతున్న సమయంలో మాజీ సీఎం జగన్ రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ తో ఎందుకు భేటీ అవ్వాలని అనుకుంటున్నారన్న చర్చ ఎక్కువగా జరుగుతోంది. తన అరెస్టుకు అనుమతి ఇవ్వొద్దని కోరనున్నారా? లేక ఇంకేమైనా ఉందా? అన్న ప్రశ్న తలెత్తుతోంది. అయితే వైసీపీ నేతలనే టార్గెట్ గా చేసుకుని ప్రభుత్వం తప్పుడు కేసులు నమోదు చేస్తుందన్న విషయాన్ని గవర్నర్ దృష్టికి తీసుకువెళ్లేందుకే మాజీ సీఎం గవర్నర్ తో భేటీకి సమయం కోరినట్లు చెబుతున్నారు. గవర్నర్ అపాయింట్‌మెంట్ లభించడంతో ప్రస్తుతం బెంగళూరులో ఉన్న మాజీ సీఎం తాడేపల్లి వచ్చారని అంటున్నారు. ప్రభుత్వం నమోదు చేస్తున్న కేసులతోపాటు తన జిల్లాల పర్యటనపై విధిస్తున్న ఆంక్షలపై కూడా గవర్నర్ కు ఫిర్యాదు చేయనున్నారని వైసీపీ వర్గాలు చెబుతున్నాయి.

**వరుస కార్యక్రమాలు**

బెంగళూరు నుంచి తాడేపల్లి వచ్చిన జగన్ రానున్న మూడు నాలుగు రోజులు పూర్తి బిజీగా గడపనున్నారు. ఈ రోజు సాయంత్రం గవర్నర్ తో భేటీ జరగనుండగా, రేపు ఉదయం పార్టీ కేంద్ర కార్యాలయంలో పార్టీ పీఏసీతో సమావేశం నిర్వహించనున్నారు. వచ్చే నెలలో ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకునే పరిస్థితి ఉందన్న అంచనాతో ఏదైనా విపత్కర పరిస్థితి తలెత్తితే ఎలా స్పందించాలన్న అంశంపై వైసీపీ అధినేత పీఏసీ దిశానిర్దేశం చేయనున్నారని అంటున్నారు. ఇప్పటికే అరెస్టు అయిన వారిని కేసుల నుంచి బయట పడేసేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలతోపాటు క్షేత్రస్థాయిలో చేయాల్సిన కార్యక్రమాలపైనా అధినేత సూచనలు చేయనున్నారని అంటున్నారు. ఇక వివిధ ఆరోపణలతో అరెస్టు అయి ప్రస్తుతం రిమాండు ఖైదీలుగా జైలులో ఉన్న రాజంపేట పార్లమెంటు సభ్యుడు మిథున్ రెడ్డి, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డిని పరామర్శించేందుకు మాజీ సీఎం రాజమండ్రి, నెల్లూరులో పర్యటించే అవకాశాలు ఉన్నాయని అంటున్నారు.

ఈ నెల 31న నెల్లూరు వెళ్లి అక్కడి సెంట్రల్ జైలులో ఉన్న మాజీ మంత్రి కాకాణితో ములాఖత్ అవ్వాలని మాజీ సీఎం జగన్ భావిస్తున్నట్లు చెబుతున్నారు. అదేవిధంగా వచ్చేనెల 5న రాజమండ్రిలో ఎంపీ మిథున్ రెడ్డితో భేటీ కావాలని భావిస్తున్నారు. అక్రమ మైనింగ్ కేసులో అరెస్టు అయిన కాకాణిని ఇంతకుముందే జగన్ పరామర్శించాల్సివుంది. అయితే అప్పట్లో జగన్ హెలిప్యాడ్ కోసం వైసీపీ అడిగిన చోట కాకుండా, మరో చోట స్థలం చూపడంతో ఆ పర్యటన వివాదాస్పదమైంది. దీంతో ఆయన నెల్లూరు పర్యటనను గతంలో రద్దు చేసుకున్నారు. అయితే కాకాణి ఇంకా జైలులో ఉండటం, ఈ కేసులో మరో మంత్రి అనిల్ కుమార్ ను అరెస్టు చేసే అవకాశాలు ఉన్నాయనే ప్రచారంతో జగన్ తన నిర్ణయం మార్చుకుని ఎట్టి పరిస్థితుల్లోనూ కాకాణితో ములాఖత్ అవ్వాలని డిసైడ్ అయినట్లు చెబుతున్నారు. ఈ పర్యటనలోనే టీడీపీ కార్యకర్తలు దాడితో ధ్వంసమైన మాజీ ఎమ్మెల్యే నల్లపురెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి ఇంటిని పరిశీలించి ఆయనను పరామర్శిస్తారని చెబుతున్నారు.

# రాజ్ నాథ్ వర్సెస్ గగోయ్... 'ఆపరేషన్ సిందూర్' పై హాట్ హాట్ కామెంట్స్!



పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత్ చేపట్టిన 'ఆపరేషన్ సింధూర్' పై సోమవారం లోక్ సభలో చర్చ మొదలైంది. ఈ సందర్భంగా... ఆపరేషన్ సింధూర్ చేపట్టడం, అది సాధించిన వీజయం, ఆ తర్వాత పాక్ సైనిక చర్య, సడన్ గా సీజ్ ఫైర్.. పై రక్షణమంత్రి రాజ్ నాథ్ సింగ్ సుదీర్ఘంగా మాట్లాడారు. ఈ నేపథ్యంలో... కాంగ్రెస్ ఎంపీ గౌరవ్ గగోయ్.. కేంద్రం తీరుపై నిప్పులు చెరిగారు. ఈ సందర్భంగా కీలక వ్యాఖ్యలు చేశారు.

అవును... పార్లమెంటులో నేడు ఆపరేషన్ సిందూర్ పై వాడీ వేడీ చర్చ మొదలైంది. ఈ సందర్భంగా మాట్లాడిన రాజనాథ్ సింగ్... ఆపరేషన్ సిందూర్ కి సంబంధించిన విషయాలు వెల్లడించారు. ఈ సందర్భంగా... గతంలో జరిగిన యూరీ, పుల్వామా దాడుల తర్వాత సరిహద్దుల్లో తీవ్రవాద మౌలిక సౌకర్యాలను పూర్తిగా ధ్వంసం చేశామని తెలిపారు. దీనిపైనే కాంగ్రెస్ ఎంపీ గౌరవ్ గగోయ్ స్పందిస్తూ కీలక ప్రశ్నలు సంధించారు. ఇందులో భాగంగా... యూరీ, పుల్వామా దాడుల తర్వాత సరిహద్దుల్లో తీవ్రవాద మౌలిక సౌకర్యాలను పూర్తిగా ధ్వంసం చేస్తే... పహల్గాంలో తీవ్రవాదులు ఎక్కడి నుంచి వచ్చారని గౌరవ్ నిలదీశారు. ఇదే సమయంలో... పాకిస్తాన్ పై యుద్ధం చేయాలని తాము అనుకోవడం లేదని, యుద్ధం తమ లక్ష్యం కాదని రాజ్ నాథ్ సింగ్ చెప్పగా.. పాక్ పై యుద్ధం చేయాలని ఎందుకు అనుకోవడం లేదో చెప్పాలని ప్రశ్నించారు. ఇలా ఓవైపు ఉగ్రవాద మౌలిక సదుపాయాలు కూల్చేశామని చెప్పుకుంటూనే.. మరోవైపు ఉగ్రవాద దాడి మళ్ళీ జరగవచ్చని చెప్తున్నారని.. అదే జరిగితే అప్పుడు పాక్ పని పడతామనని అంటున్నారని గగోయ్ ఆక్షేపించారు. గతంలో పుల్వామా దాడి జరిగినప్పుడు కూడా పాకిస్తాన్ లోకి చొరబడి కొడతామని ప్రధాని మోడీ చెప్పారని, ఇప్పుడు పహల్గాం దాడి తర్వాత కూడా అదే చెప్తున్నారని ఎద్దేవా చేశారు. పాక్ మళ్లీ దాడి చేస్తే స్పందిస్తామని చెప్పడం ఏమిటో అర్థం కావడం లేదని అన్నారు!

ఇదే సమయంలో... పహల్గాం ఉగ్రదాడిలో 26 మంది చనిపోయి 100 రోజులు గడిచినా.. ఇప్పటివరకు దాడికి కారకులను ప్రభుత్వం పట్టుకోలేకపోయిందని గుర్తు చేసిన గగోయ్ గౌరవ్... బైసరన్ లోయలోని మారణకాండకు పాల్పడిన తర్వాత ఉగ్రవాదులు కొందరి సహకారంతో పరారయ్యారని.. ఆ సమయంలో వారికి మద్దతిచ్చిన వారి గురించి సర్కారు వద్ద సమాధానం లేదని అన్నారు.

ఇదే క్రమంలో... శాటిలైట్ వ్యవస్థ, పోలీసు వ్యవస్థ ఇంత ఉన్నప్పటికీ ఇప్పటికీ ఉగ్రవాదులను పట్టుకోలేకపోయారని కాంగ్రెస్ ఎంపీ ఫైర్ అయ్యారు. ఈ క్రమంలో... ఆర్టికల్ 370 ఎత్తివేసిన తర్వాత జమ్ముకశ్మీర్ సురక్షితంగా మారిందని.. ప్రభుత్వ హామీతో జమ్ముకశ్మీర్ కు పర్యాటకుల తాకిడి మొదలైందని.. అంతలోగా ఈ దారుణం చోటు చేసుకోవడం దురదృష్టకరమని అన్నారు. కాగా... అంతక ముందు మాట్లాడిన రక్షణ్మంత్రి రాజ్ నాథ్ సింగ్... సరిహద్దులు దాటి వెళ్లడం ఆపరేషన్ సిందూర్ లక్ష్యం కాదని.. ఉగ్రవాదులకు ఆశ్రయం కల్పించే సంస్థలను ధ్వంసం చేయడమే తమ లక్ష్యమని వ్యాఖ్యానించారు. ఇదే సమయంలో... యుద్ధం మా లక్ష్యం కాదు.. ఉగ్రవాదులకు బుద్ధి చెప్పడమే మా విధానం అని పునరుద్ఘాటించారు. ఈ సమయంలోనే భారత్ దెబ్బకు పాక్ కాళ్ల బేరానికి వచ్చిందని.. మన త్రివిధ దళాలను తట్టుకోలేక పాక్ డీజీఎంవో వెంటనే మనకు ఫోన్ చేశారని.. కాల్పుల విరమణపై వివరణ ఇచ్చారు. ఇదే సమయంలో భారత్, పాక్ లతో వాణిజ్యాన్ని తగ్గించుకుంటామని తాను బెదిరించడం వల్లే ఆ రెండు దేశాల మధ్య శత్రుత్వాలు ముగిశాయని డొనాల్డ్ ట్రంప్ పదే పదే చేసిన వాదనలను రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్ తోసిపుచ్చారు. ఆపరేషన్ సిందూర్ ను ఎటువంటి ఒత్తిడితోనూ ఆపలేదని.. లక్ష్యాలు పూర్తిగా సాధించినందుకే దాడులను నిలిపివేసాయని నొక్కి చెప్పారు. ఆపరేషన్ సిందూర్ లో వంద మందికిపైగా ఉగ్రవాదులను మట్టుబెట్టినట్లు తెలిపారు.

## నేనే టీమిండియా కెప్టెన్ అయితే అలా చేసేవాడిని: ఇంగ్లాండ్‌కు అశ్విన్ కౌంటర్



**హైదరాబాద్ పెన్ పవర్:** ఇండియా, ఇంగ్లాండ్ మధ్య ఆదివారం (జూలై 27) ముగిసిన నాలుగో టెస్ట్ లో నాటకీయ పరిణామాలు చోటు చేసుకున్నాయి. మాంచెస్టర్ వేదికగా ఓల్డ్ ట్రాఫోర్డ్ స్టేడియంలో జరిగిన ఈ మ్యాచ్ లో ఐదో రోజు ఆటలో భాగంగా ఇరు జట్ల మధ్య చిన్న వాగ్వాదం చోటు చేసుకుంది. ఐదో రోజు ఆట మరో 15 ఓవర్లు ఉండగా ఇంగ్లాండ్ కెప్టెన్ బెన్ స్టోక్స్ డ్రా చేసుకోవాలని జడేజా దగ్గరకు వచ్చి షేక్ హ్యాండ్ ఇవ్వాలని చూశాడు. అయితే అప్పటికే సుందర్, జడేజా ఇద్దరూ కూడా సెంచరీలకు దగ్గరలో ఉండడంతో మన జట్టు డ్రా కు అంగీకరించలేదు. దీంతో కాసేపు గ్రౌండ్ లో హై డ్రామా చోటు చేసుకుంది. ఈ సమయంలో స్టోక్స్ మ్యాచ్ డ్రా కోసం షేక్ హ్యాండ్ కోరుతూ జడేజా దగ్గరుకు వెళ్ళాడు. అయితే జడేజా అప్పుడు 89 పరుగులు వద్ద ఉంటే.. సుందర్ 80 పరుగుల వద్ద బ్యాటింగ్ చేస్తున్నాడు. ఇద్దరూ కూడా సెంచరీలు దగ్గరలో ఉండడంతో జడేజా, సుందర్ స్టోక్స్ కు షేక్ హ్యాండ్ ఇవ్వడానికి నిరాకరించారు. క్రీడా స్ఫూర్తి మరచి భారత ఆటగాళ్లను తక్కువ చేసి మాట్లాడినందుకు ఇంగ్లాండ్ ఆటగాళ్లపై విమర్శల వర్షం కురుస్తుంది. ఈ సంఘటనపై తాజాగా టీమిండియా ఆఫ్ స్పిన్నర్ రవి చంద్రన్ అశ్విన్ స్పందించాడు. ఇంగ్లాండ్ జట్టుపై కౌంటర్ విసిరి తనదైన శైలిలో సెటైర్ వేశాడు.

తన యూట్యూబ్ ఛానల్ లోని ఒక వీడియోలో అశ్విన్ కోపంగా మాట్లాడుతూ..” రూల్ ప్రకారం మ్యాచ్ లో ఫలితం రాదని ఇద్దరు కెప్టెన్లు భావిస్తే వారు షేక్ హ్యాండ్ ఇచ్చుకొని మ్యాచ్ ను డ్రాగా ప్రకటించవచ్చు. ఇక్కడ స్టోక్స్‌కు రెండు కారణాలు ఉన్నాయి. అతను తన బౌలర్లను అలసిపోవాలని కోరుకోలేదు.

దానితో పాటు వికెట్లు పడలేదనే నిరాశలో ఉన్నాడు. దీంతో ప్రత్యర్థి జట్టు కూడా సంతోషంగా ఉండాలని కోరుకోలేదు. నేను భారత కెప్టెన్‌ను అయితే, మిగిలిన 15 ఓవర్లు ఆడమని చెప్పేవాడిని. ఇంగ్లాండ్‌కు నా ప్రశ్న ఏమిటంటే, మీరు క్రికెట్ స్ఫూర్తికి బ్రాండ్ అంబాసిడర్ అయితే, హ్యారీ బ్రూక్‌ను 15 ఓవర్ల బౌలింగ్ ఇచ్చి ఉండాల్సింది”. అని అశ్విన్ అన్నాడు.

# టీమిండియాతో ఐదో టెస్టు.. స్క్వాడ్ ప్రకటించిన ఇంగ్లాండ్

**హైదరాబాద్ పెన్ పవర్:** ఇండియా, ఇంగ్లాండ్ జట్ల మధ్య 5 మ్యాచ్ ల టెస్ట్ సిరీస్ ఆసక్తికరంగా సాగుతోంది. తొలి నాలుగు టెస్టులు ఐదో రోజు చివరి సెషన్ వరకు వెళ్లడం విశేషం. లీడ్స్ వేదికగా జరిగిన తొలి మ్యాచ్ లో ఇంగ్లాండ్ గెలిస్తే.. ఎడ్జ్ బాస్టన్ లో జరిగిన రెండో టెస్టులో ఇండియా భారీ విజయాన్ని అందుకుంది. లార్డ్స్ టెస్టులో ఇంగ్లాండ్ గెలిచి సిరీస్ లో 2-1 తో ఆధిక్యంలోకి వెళ్ళింది. ఇటీవలే ముగిసిన మాంచెస్టర్ టెస్ట్ డ్రా గా ముగిసింది. ఈ సిరీస్ లో జరగబోయే చివరి టెస్ట్ కోసం ఇరు జట్లు కసరత్తులు చేస్తున్నాయి. టీమిండియాతో జరగబోయే చివరిదైన ఐదో టెస్ట్ కు ఇంగ్లాండ్ తమ స్క్వాడ్ ను ప్రకటించింది.ఇంగ్లాండ్ క్రికెట్ బోర్డు (%జుజదీ%) సోమవారం (జూలై 28) 15 మంది ఆటగాళ్లతో కూడిన ఇంగ్లాండ్ జట్టును ప్రకటించింది. మొత్తం 15 మందితో కూడిన స్క్వాడ్ లో కొత్తగా ఫాస్ట్ బౌలర్ జెమీ ఓవర్ టన్ ను అదనంగా చేర్చుకుంది. ఇండియా, ఇంగ్లాండ్ జట్ల మధ్య ఐదో టెస్టు ఈ నెల 31 నుంచి లండన్‌లోని కెన్నింగ్టన్ ఓవల్‌లో ప్రారంభమవుతుంది. ప్రస్తుతం 4 టెస్ట్ మ్యాచ్ లు జరగగా ఇంగ్లాండ్ 2-1 ఆధిక్యంలో నిలిచింది. చివరి టెస్టులో ఇంగ్లాండ్ గెలిస్తే సిరీస్ సొంతమవుతుంది. మరోవైపు ఇండియా విజయం సాధిస్తే సిరీస్ సమం అవుతోంది. ఒకవేళ ఈ మ్యాచ్ డ్రా అయితే 2-1 తేడాతో ఇంగ్లాండ్ సిరీస్ గెలుచుకుంటుంది.



**టీమిండియాతో 5వ టెస్ట్ కు ఇంగ్లాండ్ స్క్వాడ్:**
బెన్ స్టోక్స్ (కెప్టెన్), జోఫ్రా ఆర్చర్, గస్ అట్కిన్సన్, జాకబ్ బెథెల్, హ్యారీ బ్రూక్, బ్రైడాన్ కార్స్, జాక్ క్రాలే, లియామ్ డాసన్, బెన్ డకెట్, ఓల్లీ పోప్, జో రూట్, జామీ స్మిత్ (వికెట్ కీపర్), జోష్ టంగ్, క్రిస్ వోక్స్, జెమీ ఓవర్ టన్.

# ఆట చివర్లో బ్రూక్ తో బౌలింగ్ చేయించడంపై స్టోక్స్ వివరణ



**డ్రాగా ముగిసిన ఓల్డ్ ట్రాఫర్డ్ టెస్టు**
**అద్భుత పోరాటం కనబర్చిన టీమిండియా**
**చివర్లో నిర్లక్ష్యంగా బంతులు విసిరిన బ్రూక్**
**టీమిండియా అభిమానుల ఆగ్రహం**

**హైదరాబాద్ పెన్ పవర్:** టెస్టు క్రికెట్ చరిత్రలోనే అద్భుత పోరాటం అనదగ్గ రీతిలో ఓల్డ్ ట్రాఫర్డ్ లో టీమిండియా ఆటగాళ్లు అద్వితీయమైన స్ఫూర్తి కనబర్చారు. తద్వారా, ఓటమి తప్పదనుకున్న టెస్టును డ్రాగా ముగించి, సిరీస్ సమం చేసే ఆశలను సజీవంగా నిలుపుకున్నారు. అయితే, నిన్న ఐదో రోజు ఆట చివర్లో టీమిండియా బ్యాటర్లు రవీంద్ర జడేజా, వాషింగ్టన్ సుందర్ సెంచరీలకు చేరువలో ఉండగా... ఇంగ్లండ్ కెప్టెన్ బెన్ స్టోక్స్ తమ ప్రధాన బౌలర్లను పక్కనబెట్టి హ్యారీ బ్రూక్ ను బౌలింగ్ కు దించడం విమర్శలకు దారితీసింది. దీనిపై స్టోక్స్ వివరణ ఇచ్చాడు. తమ జట్టుకు గెలుపు అవకాశాలు కనిపించినంత వరకు ప్రధాన బౌలర్లతోనే ఓవర్లు వేయించామని, ఇక డ్రా తప్పదని తేలినప్పుడు వారిపై ఇంకా భారం మోపడం సరికాదనిపించిందని అన్నాడు. అందుకే, పార్ట్ టైమ్ బౌలర్ బ్రూక్ కు బంతి ఇచ్చానని తెలిపాడు. ఇక, మ్యాచ్ ముగిసేందుకు మరో గంట సమయం ఉన్నప్పటికీ... జడేజా, సుందర్ లకు తాను షేక్ హ్యాండ్ ఇచ్చే ప్రయత్నాన్ని కూడా స్టోక్స్ సమర్థించుకున్నాడు. ఇక మ్యాచ్ లో ఫలితం తేలే అవకాశం లేనప్పుడు డ్రా ప్రతిపాదనతో షేక్ హ్యాండ్ ఇవ్వడం సాధారణమైన విషయం అని అన్నాడు. కానీ తన ప్రతిపాదనకు అంగీకరించలేదని, దాంతో, తమ మెయిన్ బౌలర్లకు విశ్రాంతి ఇచ్చి బ్రూక్ తో బౌలింగ్ చేయించానని వివరించాడు. అయితే, బ్రూక్ ఎంతో నిర్లక్ష్యంగా స్లో ఫుల్ టాస్ లు వేయడం, కొట్టుకోండి అన్నట్టు బౌలింగ్ చేయడం భారత అభిమానులను ఆగ్రహానికి గురిచేసింది. దీనిపైనా స్టోక్స్ స్పందించాడు. బౌలింగ్ చేసేటప్పుడు చెత్త పనులు చేయొద్దు... కొత్తగా ఏమీ ట్రై చేయాల్సిన అవసరం లేదు అని బ్రూక్ కు చెప్పానని వెల్లడించాడు.

# ప్యారడైజ్ దసరా గిఫ్ట్ కోసమే..?





**హీర్ అచ్రా: చిక్ స్టైల్‌తో అప్రయత్నంగా ప్రకాశిస్తుంది**

న్యాచురల్ స్టార్ నాని ప్యారడైజ్ పనుల్లో బిజీగా ఉన్నాడు. శ్రీకాంత్ ఓదెల డైరెక్షన్ లో తెరకెక్కుతున్న ఈ సినిమా మిగతా కాస్టింగ్ ఎవరన్నది ఇంకా వెల్లడించలేదు. దసరా నిర్మాత సుధాకర్ చెరుకూరి ఈ సినిమా నిర్మిస్తున్నారు. ప్యారడైజ్ ఫస్ట్ స్టేట్మెంట్ తోనే నాని సర్ ప్రైజ్ చేశాడు. తన రా అండ్ మాస్ స్టేట్మెంట్ తో సినిమా రేంజ్ ఏంటన్నది చూపించాడు నాని. ఐతే ఫస్ట్ టీజర్ అదిరిపోగా సినిమాపై అంచనాలు కూడా భారీగా పెంచింది.

**దసరాకి ప్యారడైజ్ అప్డేట్..**

ఐతే ప్యారడైజ్ సినిమా రెండో టీజర్ ఎప్పుడని ఫ్యాన్స్ అడుగుతున్నారు. దసరాకి ప్యారడైజ్ నుంచి ఏదైనా అప్డేట్ ఉండొచ్చా అనే చర్చ నడుస్తుంది. సినిమాను నెక్స్ట్ మార్చి రిలీజ్ లాక్ చేశాడు నాని. ఎట్టి పరిస్థితుల్లో అనుకున్న డేట్ కి సినిమా వచ్చేలా ప్లాన్ చేస్తున్నారట. నాని ప్యారడైజ్ లో కథానాయిక ఎవరన్నది ఇంకా తెలియలేదు. అసలు ఎవరిని తీసుకోవాలని అనుకుంటున్నారన్న క్లూ కూడా బయటకు రాలేదు. ప్యారడైజ్ సినిమాలో నాని సర్ ప్రైజ్ రోల్ లో కనిపిస్తాడట. ఫస్ట్ టీజర్ తోనే రెండు జడలతో నాని ఇచ్చిన షాక్ తెలిసిందే. అంతేకాదు సినిమా ఎంత ఒరిజినల్ గా ఉంటుందో అందులోని డైలాగ్స్ కూడా అదే రేంజ్ లో ఉండేలా ఉన్నాయి. సెన్సార్ కి ఈ సినిమా బాగా పనిచెప్పేలా ఉందని టీజర్ చూస్తేనే అర్థమవుతుంది.

**పాన్ ఇండియా స్టార్..**

ప్యారడైజ్ సినిమా దసరా గిఫ్ట్ కోసమే నాని అంతా రెడీ చేస్తున్నాడట. ఈసారి టీజర్ లో మరింత వైల్డ్ గా క్రేజీగా ప్లాన్ చేస్తున్నాడట నాని. శ్రీకాంత్ ఈ సినిమాతో కచ్చితంగా పాన్ ఇండియా స్టార్ డైరెక్టర్స్ లో ఒకడిగా మారతాడని అంటున్నారు. ఈ సినిమా పూర్తి చేసి నాని సుజిత్ డైరెక్షన్ లో సినిమా చేయనున్నాడు. నాని ప్యారడైజ్ సినిమా షూటింగ్ అంతా కూడా చాలా సీక్రెట్ గా చేస్తున్నారట. సినిమాలో యాక్షన్ ఘట్టాలు కూడా సంథింగ్ స్పెషల్ అనిపిస్తాయట. తెలుగు తెర మీద ఇదివరకు ఎప్పుడు చూడని ఒక కథతో నాని శ్రీకాంత్ ప్యారడైజ్ వస్తుందని అంటున్నారు. ఐతే ఈ సినిమా కథకు కొన్ని రియల్ ఇన్సిడెంట్స్ కూడా రిఫరెన్స్ అని తెలుస్తుంది. నానిని మరోసారి టాప్ రేంజ్ లో నిలబెట్టేలా ప్యారడైజ్ ఉంటుందని అంటున్నారు. ఈ సినిమాలో నాని క్యారెక్టరైజేషన్ ఏకంగా నేషనల్ అవార్డ్ కూడా తెచ్చినా ఆశ్చర్యపోవాల్సిన పనిలేదని అంటున్నారు.



**కొచ్చి ఐలాండ్ లైఫ్‌కి మాళవిక మోహనన్ హృదయపూర్వక నివాళి**

On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh. Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh.
Editor: G.APPARAO, Mobile : 9059465965, RNI : APTEL/2014/58046, e-mail:penpower9@gmail.com